రాజమండ్రీలో టిక్కెట్టు ఇస్తూ అంకె చూస్తినిగదా! దూరం 361 మైళ్లు. పుంతలో ముసిలమ్మమీద అంకె 361. తుపాను చెలరేగినా చెడనిదీ అంకె వొక్కటే అని అనుకొన్నాను. కాని మదరాసులో ఆవారం నన్ను విసుగులేని త్రిప్పట త్రిప్పింది ఏ అంకె? ఏ రాయి? అంకెలేని మగరాయి! దానికోసమే నేనాదాకా తఋముకెళ్ళిన "మాన్‌సూన్‌స్పీడ్" అని అనిపించింది.

....

ఇంగ్లీషు చదువూ ఫరంగీ వేషం

రాజమహేంద్రవరములో ప్రభుత్వమువారు కట్టించిన కట్టడాల్లో "బోధనాభ్యసన కళాశాలా" భవనం చాలా పెద్దది. అపురూపమైనది అని నా అభిప్రాయం.

1906-న ఉత్తరసర్కారుల్లో అదొక్కటే ఎనిమిదవ తరగతినుండి పదవతరగతి వఱకు "ఆదర్శ పాఠశాల" అనే పేరుతో అంతర్భాగము గలిగివుంటూ వుండిన విద్యాసంస్థ. ఏమా అంటే ఎనిమిదవ తరగతి నాలుగుగదులు, తొమ్మిది మూడు గదులు, పది మూడు గదులు ఆబరించుకొని వుండేవి, అన్ని గదులున్నాయా అని ఆశ్చర్యపోతున్నారు లాగుంది పాఠకులు. ఆశ్చర్య పోనక్కరలేదు. నిజంగా వుండేవి. ఉండడంలోను "పక్కాబిల్డింగు"కు సంబంధించిన గదులవి. రాతిగోడలు, రంపానకు తెగని దూలాలు! అన్నింటికంటే అతివిచిత్రం పెద్ద మేడ! మేడ ఎక్కడానికి దుక్కల్లాంటి మెట్లు! నాటికీ నేటికీ

ఒక్కటాకీగా, పిడుగుపడ్డా చెక్కుచెదరని భవనం ఆ నగరంలో అదొక్కటే అని చెప్పొచ్చు.

దాని ఆకారం, కిరస్తానీ మతస్థులైన ఆంగ్లేయుల పరిపాలనా విధానంలో ఏర్పడ్డ కారణంగా 15-8-1947 అనగా భారతస్వాతంత్ర్య శుభవాసరమువఱకు, "క్రాస్" రూపం ధరించి వుండి ఇప్పుడు "క్రాస్" అనగా "శిలువ" రూపం విసర్జించి, గరుడపక్షి రూపం తీసికొన్నది అని నావూహ. దక్షిణపు వైపునకు ముక్కు అవితే, ఇటో రెక్క (వింగ్). అటో రెక్క (వింగ్). ఉత్తరం వైపునకు తోక—భూమిమీద నుంచి అలా మీదమీదకూ లేచిపోతూవున్నట్టుండి వ్యామోహం గొల్పక మానదు ప్రాతవిద్యార్థుల కాకట్టడం నేడు.

కట్టడానికి చుట్టూ అంతో ఇంతో విశాలమైన ఆటస్థలం వుంది. ఆ స్థలంలో పక్కగా నాలుగో అయిదో శిరీషవృక్షాలు వివృద్ధములైన వివిరుద్ధములైనవి ఉన్నాయి. విరుద్ధములైనవి అని ఎందుకు అంటూవున్నానూ అంటే అంత ముసలి చెట్లూ, వింత వింత మెత్తని పువ్వులు ఏటేటా పూస్తూ, స్కంధంచూపే మోటుదనంకు, ముదిమికి పెళుసుకు డొళకకు కేవలం వ్యతిరేక ప్రతిక్షణ ప్రసవభావాలన్నట్టు గోచరిస్తాయి. వాటినీడను నడుస్తూ వుంటే ప్రతి జరఠునకు, వాలాయం ఏదో కుఱ్ఱదనం, ఏదో క్రొంగ్రొత్త సుకుమార నవనవోన్మేష కిశోర వినోదం అంకురింపక మానవు.

క్రీ. శ. 1946 వ సంవత్సరంలో ఒకనాటి యుదయం పదిగంటలకు ఆ చెట్లయొక్క జాడ జాడ నీడల్లో అడుగులు వేసికొంటూ నేనూ నా రెండవ కుమారుడు చిరంజీవి—నడుస్తూ

వున్నాము గబగబా! వాణ్ణి త్వరగా తీసికొనివెళ్ళి నాలుగవ తరగతిలో ప్రవేశపెట్టాలి, ఆ పెద్ద కళాశాలలో.

భవనం సినీమా దృశ్యంలా ప్రాంగణపు టుద్యానవనపు గొమ్మలసొంపుగుండా దోబూచు లాడ్తూవుంది. అంత గబగబా నడుస్తూ వున్న నడక మాని మా వాడు నన్ను కూడా ఆపి,—"తన్ను చేర్పించేది ఆ పెద్ద మేడలోనేనా?" అని అడిగాడు. "ఇంకా పరీక్ష ఇవ్వలేదు. మేడా గీడాను నీకు?—నడువు త్వరగా నడువు—మొదటి గంట కొట్టినట్టున్నారు" అన్నాను. వాడు పరీక్ష అన్న మాట వినిపించుకోకుండా. చెట్ల కొమ్మల వంక చూస్తూ "పువ్వులు చూచారా? ఎంత ఎఱ్ఱగా, కుచ్చుల బొగడల్లా వున్నాయో! నా కొకటి కోసి ఇవ్వరూ!" అని అడిగాడు.

"నాకు మాత్రం అందుతాయిరా?" అని ఎగిరాను పైకి చూస్తూ. నేనున్నూ ఆ చూపులో పరీక్ష సంగతి మరచి పోయాను. ఏ పువ్వూ అందలేదు. రెండవ మారు ఎగిరాను. మూడవ మారు ఎగిరాను, మూడవసారి కాబోలు, ఒక పువ్వు ఏ కారణంవల్లనో దానంతట అది, సరికొత్త పూసిందే వూడి పడింది నా దోసిట్లోకి, తొడిమైనా కందనిదీ, పుప్పొడి అయినా రాల్చనిదీ; ఎప్పటి పువ్వైతేం? అప్పటిదిలా కనిపించే టప్పుడు! దాని పుట్టు పూర్వోత్రాలు దాన్ని అడగడానికి నేను పుణికితేగా? అదే పడింది దానంతట నా దోసిట్లో దేవతా వరంలా.

"వారేవ్! ఇదిగోరోయి! నీ అదృష్టముకొద్దీ ఒక పువ్వు అందుకోగల్గాను!" అన్నాను గొప్పగా కుఱ్ఱనితో

దంభంగా. పిల్లవాడు కాస్తో కూస్తో తెలివైనవాడు కావడంచేత "నేను చూచాను! మీరు అందుకోలేదు. మూడుసార్లు ఎగిరినా అందుకో లేకపోయారు" అన్నాడు. "మరెల్లా వచ్చింది?" అన్నాను. వాడున్నూ తెల్లబోయాడు.

గట్టిగా "సూర్యనారాయణా!" అని కేకవేశారు పాఠశాల్లో. "హాజరు సార్!" అని మా వాడు నన్ను విడిచిపెట్టి అటు పరుగెత్తాడు. హైరోడ్డుమీద మోటబళ్ళూ, మోటారు కార్లు వుంటాయి. పిల్లవాడికి ప్రమాదమేమో అని వాణ్ణి ఆ పాఠశాలావరణలో ప్రవేశపెట్టేవరకూ అనుగమించానేగాని, వాని పరీక్ష పత్రము నన్ను వ్రాయ నివ్వరుగా. వాడే వ్రాసి, వాడే జవాబులు చెప్పి కృతార్థుడు కావాలి.

ఇటు అటూ చూచాను. వా డప్పుడే పాఠశాలా భవనంలో ఏ మూలనో ఇరుక్కుని కూర్చుని వుండి వుంటా డనుకున్నాను. అంతలో వాడు తిరిగి వచ్చి "నన్ను ఎడ్మిట్ చేసుకున్నారండో నాల్గవ క్లాసులో నాన్నగారూ! మీ పేరెందుకో అడిగారు హెడ్మాస్టారు, అడిగితే నేను చెప్పాను—మీరూ ఈ బడిలోనే చదువుకున్నారటగా! ఎప్పుడూ చెప్పారుకాదేం నాతో?" అని అడిగాడు అంతక్రితం ఎప్పుడో ఆ భవనం తాను చూచినట్టు, తా నప్పుడే దాని పాత కాపైనట్టు అతి చనువుగా.

ఇకక్కణ్ణుంచి అచ్చెరువుగా అతిచమత్కారంగా నా మనస్సులో వెళ్ళిపో సాగినాయి వూహాలు! "1906 లో నేనా భవనంలో తొట్ట ప్రవేశించింది ఎనిమిదవ తరగతిలో. 1946 లో నీవు నాల్గవ తరగతిలో ఎడ్మిట్ అయినావు" అన్నాను వానితో. "ఏమిటి కారణం? నన్ను నాల్గవ తరగతిలో చేర్చుకోడానికి,

మిమ్మల్ని ఎనిమిదవ తరగతిలో చేర్చుకోడానికి ?" అని అడిగాడు వాడు. "అప్పుడున్న నేను ఇప్పుడున్న నీకంటె జేనెడు పొడుగుండేవాణ్ణి ! తెలుసుకో !" అని జవాబు చెప్పాను. "జాన ?" అంటే అని అడిగాడు. "జేన" అంటే అని చూపించాను అయిదు వ్రేళ్ళను సాచి చిటికెన వేలు వాని బుజ్జి మీద నిలబెట్టి "అవితే నేను—ఒక వేలు నాలుగవ తరగతి, రెండో వేలు అయిదో తరగతి, మూడో వేలు ఆరో తరగతి, నాలుగో వేలు ఏడో తరగతి, అయిదో వేలు ఎనిమిదో తరగతి–ఇప్పటికంటె ఒక జేన ఎదిగితినా ఎనిమిదో తరగతికి నేను ఫిట్" అన్నాడు గెంతుతూ.

"ఓ ఇడియట్ ! ప్రతీ సంవత్సరం పరీక్షలు ప్యాసు అవ్వాలోయి" అని వాణ్ణి వాత్సల్యంతో "పాట్" చేసిన వాణ్ణయి, అనగా తట్టిన వాణ్ణయి, వాణ్ణి గుర్తుగా నఖశిఖ పర్యంతం చూచాను. కంపెనీ కణుజు షూస్, కాకీనిక్కర్, సైకిల్ బ్లూ బుష్ కోటు, సెలూన్ కట్ క్రాప్ వాడూ ఏలా వున్నాడు—1999 వేషంకు బాబులా వున్నాడు.

వెంటనే నాలో ప్రదర్శింపునకు వచ్చింది, 1906 లో నేను ఆ పాఠశాలా భవనం ప్రవేశించి నప్పటి నా డిరీసు నా నోసు—నా కా రోజుల్లో రెండు కాళ్ళకు రెండు వెండి కడియాలు గుల్లవి వుండేవి. అవి కనబడకుండా మేజోళ్ళు వేసేసి, నాటు గొడారి వాడు కుట్టిన గొడ్డు చర్మపు బూట్లు, అమ్మమ్మ కుట్టిన బొందు లాగు, అయ్యకు చాలని పాత కమీజు, కఫ్సు మీదకు తీసినప్పు డల్లా మెరుస్తూ వచ్చే పలకల బంగారపు కడ్డీ మురుగులు, నెత్తి మీద నోఎగుడు దిగుడు మొఖమల్ టోపీ—ఎగుడు దిగుడు

అని ఎందుకు అనవలసి వస్తూవుంది అంటే, గుప్పిటి కొలది జుత్తు ముడి వెనుకతట్టు ఆటోపీలో డాగేలా కుక్కేశాను—ఇంకా పిల్ల జునపాలు అలా మెడమీద వ్రేలాడే వుండేవి; మఱిన్ని రెండు చెవుల్నీ రెండు పోగులు, కమ్మచ్చు తీసినవి, కనకపు బిళ్ళలు కలవి, తీగ అతుకున అల్లిబిల్లివి మెలేసుకు పోయినవి ! ఇన్ని ఉండేవి !

క్రమ క్రమంగా ఆ పాఠశాలా భవనంలో పాశ్చాత్య విద్య నభ్యసించినకొద్దీ పైని వివరించిన సాంప్రదాయపు ఆభరణాలు నా వొంటిమీదనుండి ఏలా నేను తొలగించి విసర్జించిందీ ఆ కథ పట్టు అంతా జ్ఞాపకం వచ్చింది.

1906 కు పూర్వం "డ్రిల్" ఎఱుగుదును గాని 'స్పోర్టు' ఎఱుగను. 1906 లో కొత్తగా కాలి బంతి ఆట ప్రారంభించాను. కారణం ఏదో ఆట ఆడక తప్పదని నిర్బంధం వుండేది ఆ పాఠశాలలో. కాలి బంతి ఆటకు కడియాలు ఎంత మాత్రం అనుకూలంగా వుండేవి కావు. మైకల్ మాస్ సెలవులకు మా వూరు వెళ్ళినప్పుడు అటో పాలికాపును ఇటో పాలికాపును కూర్చోమని వాళ్ళచేతికో జనప నార పలుపు ఇచ్చి, కడియాల్లోకి దూర్చి సాగదీసెయ్యమన్నాను. గమ్మతుగా ఊడి వచ్చేశాయి రెండు కడియాలూను. అంతలో మావా శ్ళైవళ్లో, పినతండ్రుల్లో వాకరో, తండ్రో, వచ్చి "కడియాలు తీయించేస్తే తీయించేసు కున్నావుగాని మురుగులు తీసేసుకోకురా !" అని ఆజ్ఞాపించారు. నేను వాళ్ళంత పెద్దవాణ్ణి కాకపోయినా వాళ్ళకన్న పెద్ద చదువు చదువుతూన్నాననో ఏమో నేను గావించుకున్న మార్పునకు వాళ్ళు అంగీకరించారు. మా పెద్దవాళ్ళ కాళ్ళకు మగవా ళ్లైవళ్లకూ

కడియాలు లేవు కూడాను. కాని మా పెద్ద పినతండ్రిగారి చేతుల్ని గల్ గల్ బంగారపు కడియపు మురుగు లుండేవి. మరిన్ని చిన పినతండ్రిగారి చేతుల్ని చనిపోయేవఱకూ కూడా గోడి మలచిన పచ్చని మురుగు లుండేవి. "మాకు ఉన్నాయి చూడు!" అని చూపించారు వాళ్ళ వాళ్ళ ఆభరణాలు ఆ పెద్ద మగవాళ్ళు. "అంతకంటె శిక్షించలేదు" అని సంతోషించి, ఒక పర్యాయం నా మణికట్ల మురుగులు చూచుకొన్న వాణ్ణయి కడియాలు ఆ పెద్దవాళ్ళకు ఒప్పజెప్పేశాను. తరువాత వారు కరిగించి కంచమే చేయించారో, మంచపు తలాపు పెట్టెలో ఉంచే వేశారో—కలిమిలేములు కావటి కుండలు అన్నట్టు అవి ఏమయ్యాయో మఱి నా కడియాలు నా కంట పడలేదు.

ఇఖ మురుగుల చరిత్ర చెప్పమన్నారా! మైకల్‌మాస్ సెలవులయి తిరిగి పాఠశాలకు వచ్చి చదవడంలో రసాయన శాస్త్రపాఠంలో పాదరసాన్ని గురించిన ప్రయోగమొకటి వచ్చి, చేస్తూవుంటే ఉపాధ్యాయుడాలా నా చేతిలో ఒక పాదరసం బిందువుంచి దాని లక్షణాలు గమనించమన్నాడు. అది అరచేత నల్లా ఇల్లా అనడంలో గెంతి అదిజారి నా మణికట్టుకు ఒక మురుక్కు-మధ్య నిరుక్కుంది. బంగారాన్ని తినెయ్యా మొద లెట్టింది. మురుగు తెలుపెక్కింది. నేను ఆహాశంగా ఏడుపు ముఖం వేశాను. "వెంటనే మీవాళ్ళతోచెప్పి ఆ మురుగులు తీయించివేసుకు మఱి రేపు క్లాసుకురా!" అని యొజ్జ లాజ్ఞాపించారు. ఈ సంగతి ఊరంతా పొక్కినంత పని అయింది. ఫలితం? నా మణికట్లనుండి మురుగులు లాగివేయబడినాయి. నా మణికట్లు చిన్నబోయినాయి.

ఇక మూడో ఆభరణం చెవిపోగులమాట కూడ చెప్పేస్తే మీకూ నాకూ మొండితేలు బాధ వుండబోదు.

పాఠ్యగ్రంథంలో ఇంగ్లీషు సంభాషణ పాఠం "హ్యూబర్ట్ అండ్ ఆర్థర్" అన్నది ఒకటి మాకారోజుల్లో వుండేది. దాన్ని నాటకంగా ఆడాలి. "నీవు ఆర్థరివి" అని నన్నుండ బంచారు. మరో అతణ్ణి హ్యూబర్టుగా ఏర్పాటు చేశారు. తొలిరోజున రిహార్సలు. హ్యూబర్టు ఎఱ్ఱగాల్చిన ఇనుప ఊచలు రెండు తెచ్చి నా కళ్ళల్లో గ్రుచ్చెయ్యాలి. నాకప్పు "వికచాంబకముల్ శతపత్ర జైత్రముల్ :" గ్రుచ్చేశాడా చెవిపోగులు మూసల్లో మల్లే కరిగిపోగలవు! రిహార్సల్ కాబట్టి గ్రుచ్చెయ్యలేదనుకున్నాను. మర్నాడు అసలు నాటకము వేసేటైముకు మావాళ్ళతో చెప్పాను. "చెవిపోగులు తెంపెయ్యవలసి వుంటుం" దని. తెంపెయ్యబోకు నీపుణ్యమాయిరి! అని కంసాలికి కబురెట్టి కటక్కున కత్తిరింపించి, చెవిపోగులే కరిగిపోయేటప్పుడు జుత్తు జునపాలు తెగ్గాలిపోవా అని పనిలో పని వాటినికూడా తీయింపించేశారు. దానితో అస్సలైన దొరల పిల్లవాడిలా తయారై వూరుకున్నాను. మఱి నాటకవేషంలోనన్ను వెంకట్రావు అనివొక్కరూ పోల్చలేక పోయినారు ప్రేక్షకుల్లో. అంతా నన్ను ఆ ఆర్థరే అని మెచ్చుకున్నారు. ఏ ఆర్థరు? లిజెండరీ ఆర్థరు కాదు, షేక్స్పియర్ వ్రాసిన షష్టమ హెన్రీలోని ఆర్థర్ !

మఱచిపోకండి ! ఆనాటి ఆ కుఱ్ఱవాని చెమ్మగిల్లిన కళ్లూ, హ్యూబర్టు కమ్మరి కొలింలోంచి కాల్చితెచ్చిన గరిటి కాడలూను !

....